# 15. సుఖం . . . .

ఏళ్ళతరబడి పాలేరుండి ఏం బాముకోకున్నా. ఎముకలే మిగిలినా దొరసేవకే అంకితమవుదామని మళ్ళీ పాలేరుదే అమాయకుడిలా మరో సారి ప్రయత్నిద్దామని చెట్టుదగ్గరి కెళ్ళాడు యాదగిరి చెట్టెక్కి శవాన్ని భుజంపై వేసుకొని దిగాడు—గబగబా శ్మశానందిక్కు నడుస్తున్నతనితో శవంలోని భేతళుడు

“ఓ మనిషీ! నిన్ను చూస్తుంటే సమస్యల సుడిగుండంలో సతమతమవుతున్నవాడిలా కనిపిస్తున్నావు—నువ్వేంకోతి నన్ను వశపరచుకోవాలనుకుంటున్నావు—?” అన్నాడు...

ఈ భేతాళుడు భలేవాడు—నాకు మౌనభంగం కల్గించి మాయమైపోదామని చూస్తున్నాడు .... ఆ పప్పులేం నా దగ్గరుడకవు—, తనలో తాను దృఢనిర్ణయం చేసుకొని పెదవులు దగ్గర పెట్టుకొని పరుగెత్తినట్టుగా నడుస్తున్నాడు యాదగిరి—

“అంతగా పరుగులు పనికిరావు— తొందరగా అలిసిపోతావు— అటు తర్వాత గమ్యం చేరుకోవడం కష్టమవుతుంది — అందుకే పెద్దలన్నారు నిదానమే ప్రధానమని— నీ తొందరపాటుతనం చూస్తుంటే నీకు నువ్వే సుఖానికి దూరమతున్నవాడిలా అనిపిస్తున్నావు—”

“మీ మాటలు నిజంకావు— నేను జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనే ప్రయత్నిస్తున్నాను— కాని సాధ్యంకావడంలేదు — చాలీచాలని ఆదాయం—ఎదిగొస్తున్న పిల్లలు— పెరుగుతున్న ఖర్చులు—ఇంటిమీది

కొచ్చి మరింత ఖర్చులు పెంచే బంధువులు—వాళ్ళనేమనలేని నా మెతక తనం—అయితే నేను బయటకెళితే మాత్రం ఒక్కపూట భోజనానికైనా నోచుకోలేని దురదృష్టం—పిల్లల చదువులు—ఆడపిల్లల పెళ్ళిళ్ళు—పెరిగే ధరలు—పెరగని జీతం—నాకేంచేయాలో తోచడంలేదు—అన్నిరకాల ప్రయత్నాలు విఫలం కాగా నిన్నైనా స్వాధీనం చేసుకొని నా కోర్కెలు తీర్చుకోవాలనుకుంటున్నాను—,

గొణుక్కున్నట్టనుకొని గంభీరంగా శ్మశానం దిక్కు నడుస్తున్నాడు—యాదగిరి నిలా మాట్లాడించడం సాధ్యంకాదని భేతాళుడు "నీ దృఢనిర్ణయానికి ఆనందిస్తున్నాను—నీకు ప్రయాణబడలిక తెలియకుండా ఉండడానికో కథ చెబుతాను—" అని కథ చెప్పడం మొదలుపెట్టాడు—

"మనుషుల్లో రకరకాల వాళ్ళుంటారు—కొందరు జీవితమంతా సంపాదనకే వెచ్చించి కడుపునిండా తిండైనా తినరు—కొందరు హాయిగా తినడం, తాగడమే సుఖమనుకుంటారు—కొందరు వివిధ ప్రదేశాల కెలుతూ ఎంజాయ్‌చేస్తారు—కొందరు సినిమాల్లాంటి వినోదాల్లో సుఖాన్ని చూస్తారు—కొందరు తాము నమ్మిన సిద్ధాంతాలకు అంకితమై బ్రతుకడంలోనే సుఖముందనుకుంటారు—కొందరు జీవితాన్ని కళారంగానికే అంకితం చేస్తూ ఒక్కపూట తిండి దొరకకున్నా అందులోనే ఆనందాన్ననుభవిస్తారు—కొందరు పరిశోధనలకే అంకితమై బ్రతుకుతారు—కొందరు తాము క్రొవ్వొత్తిలా కరిగిపోతున్నా కుటుంబం, బాగోగులను చూడటంలోనే సుఖముందని భావిస్తారు—ఇలా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా సుఖాన్ని చూస్తారు....

దీని కుదాహరణంగా నీకో చిన్నకథ చెబుతాను—

సాయం సమయం—చల్లని వెన్నెల—ఇద్దరమెరికన్లు సముద్రంలో పడవలో తిరుగుతూ చేపలవేట సాగిస్తున్నారు—తమ పనిలో నిమగ్నులై

చేపలు పడుతున్నారు — బయట చల్లని వెన్నెలున్నా చెమటలు కక్కు-
తున్నారు- వారి ప్రక్కనే మరో పడవలో ఇద్దరు ఇటాలియన్లున్నారు-
వారు పడవలో హాయిగాపడుకొని పిండారబోసినట్టువున్న వెన్నెల్లో పరవ
శం చెందుతూ చంద్రుడిని చూస్తున్నారు ఇటాలియన్లను చూచిన అమె
రికన్లు తమ పడవను వాళ్ళపడవ సమీ త దగ్గరకు తెచ్చారు....

"మీరు సమయాన్ని వృధాచేస్తున్నారు—!" అన్నాడు ఇంగ్లీషులో
అమెరికన్—

ఆ మాటలకు ఇటాలియన్లు నవ్వారు....

"మీరేం చేస్తున్నారు—? అని ప్రశ్నించాడింగ్లీషులోనే ఇటాలియన్-

"చేపలు పడుతున్నాం—"

"ఈ చేపలు నేంచేస్తారు—?"

"అమ్మతాం "

"అమ్మతే ఏమొస్తుంది...?" "డబ్బు"

ఆ డబ్బుతో ఏంజేస్తారు...?"

"ఎంజాయ్" అన్నారు అమెరికన్లు..

"అంటే....? మీరెంజాయ్ చేయాలంటే సముద్రంలోకి రావాలి-
చేపలు పట్టాల—వాట్ని అమ్మాలి—వచ్చిన డబ్బుతో సుఖం కొనుక్కో
వాలి...ఇట్ ఈజ్ ఏ లాంగ్ ప్రాసెస్-మమ్మల్ని చూడండి—మేమూ
ఎంజాయ్‌మెంటును మేము చల్లని వెన్నెల్లో పడుకొని చంద్రున్ని, నీలాకా
శాన్ని చూస్తూ, పిల్లతెమ్మరల చల్లదనాన్ననుభవిస్తూ పొందుతున్నాం-"
అని నవ్వారు ఇటాలియన్లు...

ఆ మాటలకు విస్తుపోయారు అమెరికన్లు—

కథ చెప్పడం ఆపాడు భేతాళుడు....

ఈ కథ చెప్పడంలో ఉద్దేశ్యమేంటి! ఇటాలియన్ల మాటల్లోని అంతరార్థమేంటి...? ఇటాలియన్లు చెప్పినట్టుచేస్తే సరిపోతుందా...?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిసీ చెప్పకపోయావో ఏంచేస్తానో చెప్పను...చేసి చూపెడతాను...అని మౌనం వహించాడు భేతాళుడు....

"ఉన్న వసతులనుపయోగించుకొని సుఖపడటం నేర్చుకోవాలని ఈ కథ చెబుతుంది—ఇది మంచి ఉద్దేశ్యమే...కాని, మేడలు, మిద్దెలు కాకు కనీసావసరాలైనా తీరకుంటే ఎలాసుఖపడేది—? అక్కడికి ఉన్న పరిస్థితులను సుఖమయంగా మార్చుకునే ప్రయత్నంచేస్తూనే వున్నాను-

అమెరికన్ల ఉద్దేశ్యంలో సుఖం డబ్బుతో వచ్చేదయితే ఇటాలియన్ల ఉద్దేశ్యంలో అది డబ్బుతో మాత్రమేరాదని రకరకాలుగా వుంటుందని-

ఇటాలియన్లు చెప్పింది మరీ మెటీరియలిస్టిక్ గా ఉండొద్దని చెప్పడం వరకైతే బాగానేవుంది కాని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూనే కాలం గడపడం ఎలా సాధ్యం? కడుపులో పేగులు గోలచేస్తుంటే కళ్ళకు ప్రకృతి సౌందర్యం కనబడదు—చీకటౌస్తుంది—'

యాదగిరికి మౌనభంగం కాగానే శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు భేతాళుడు

["ఈ పక్షంలో" పక్షపత్రిక అక్టోబర్ 1986]

—★—